


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-91-

## ఎడారి గుండెల్లో..

కువైట్ సేటు ఇంట్లో బంగారు గిన్నెల దొంగతనం. తనే చేసిందా దొంగతనం. ఇది నిజమా. తను దొంగా.. చెయ్యకపోతే అవి తన పెట్టెలోకి ఎలా వచ్చాయి?

అందరూ నువ్వే చేసావు. నువ్వు దొంగవు అంటున్నారు. నాలుగు దెబ్బలు కొట్టి తీసుకొచ్చి జైల్లో పెట్టారు. ఇక ఈ జీవితం ఈ కువైట్ జైల్లో ముగిసి పోవాల్సిందేనా? భోరుమని ఏడవాలనిపించింది ఈశ్వరమ్మకు.

జైలంతా వినబడేలా కాదు. ప్రపంచమంతా వినబడేలా నేను దొంగను కాను అని గట్టిగా అరవాలనిపించింది. తన గోడును ఇక్కడ ఎవరు వింటారు. ఎవరికి అవసరం వుంది. తడిలేని ఈ ఎడారి గుండెలు మనిషి కంట్లోని తడిని తుడుస్తాయా? కన్నీళ్ళతో కుమిలిపోతోందామె.

వచ్చే ఏడుపును ఆపుకుంటూ కూర్చుని జైలు ఊచలు ఎన్నున్నాయో లెక్క బెడుతోంది ఈశ్వరమ్మ.

అంతా తాను చేసుకున్న ఖర్మ. అక్కడే ఊర్లో కలో గంజో తాగి కొడుకుల పంచన పడి వుండకుండా ఈ పరాయి దేశానికి వచ్చి చేయని నేరానికి శిక్ష అనుభవించడం ఖర్మ కాకపోతే ఏమవుతుంది. తన రాత బాగ లేదు. తన చావు ఈ ఎడారి నేలపై రాసి పెట్టి వున్నట్లుంది. అంతే.

కొడుకులు కోడళ్ళ బాధ భరించలేక ఇక్కడైనా ప్రశాంతంగా వుందామని ఈ కొయేటికి వచ్చింది. ఇక్కడ కూడా కాలం కలిసి రాలేదు. సేట్లు దొంగతనం అంటగట్టి జైల్లో తోసారు.

ఇక బయటపడి ఇండియాకు పోవడం పుట్టిన ఊరిని చూడటం కలలో మాటే. ఆలోచనలతో నిద్ర రావడం లేదు. తిండి సహించడం లేదు. జైల్లో తిండి ఏమి సహిస్తుంది. కటకటాల వెనక కంటికి నిద్ర ఎలా వస్తుంది. ఇప్పటికే పది రోజులు గడిచాయి. అయినా తప్పు చేసి వుంటే శిక్ష అనుభవించడం కష్టమనిపించదు. అంత బాధనిపించదు. చేయని నేరానికి ఈ శిక్ష ఏమిటి?

అయినా ఆ బంగారు గిన్నెలు తన పెట్టెలోకి ఎలా వచ్చాయి. ఎవరు చేసారు. ఎందుకు తనను ఇందులో ఇరికించారు. దు:ఖం ముంచుకొచ్చింది. కళ్ళు మూసుకుంటే కనుకొలుకులనుండి వెచ్చని కన్నీళ్ళు గుండెలపైకి జారిపడుతున్నాయి.ఎంత కష్టపడి ఎన్ని ఆశలతో ఈ కువైట్ కి వచ్చిందో గుర్తొచ్చింది.

"ఒరే సుబ్రమణీ ఇంట్లో చాలా కష్టంగా వుందిరా. అప్పులు, వాటికి వడ్డీలు ఎక్కువయ్యాయి. మెళ్ళో గొలుసు అమ్మి నీకు దుడ్డిస్తాను. నాకొక కొయేటు వీజా చూడు నీ ఋణం వుంచుకోను" ప్రాధేయపడింది ఈశ్వరమ్మ.

"ఏమ్మా ఈశ్వరమ్మా నువ్వు కొయేటికి పోయి ఈ దేశాన్ని ఉద్దరించుదామనుకుంటున్నావా. ఎపుడైనా అద్దంలో నీ ముఖం చూసుకున్నావా లేదా.ఇక్కడ అందమైన పడుచు ఆడోళ్ళకే వీజాలు దొరకడం లేదు. నీకు ఎముకలు తప్ప వంట్లో కండ ఎక్కడా లేదు. నీకు వీజా ఎలా వస్తుంది. గాలికి ఎగిరిపోయేలా వుంటే ఎవడిస్తాడు నీకు కొయేటు వీజా" పకపకా నవ్వాడు ఏజెంటు మణి.

ఉడుక్కుంది ఈశ్వరమ్మ. "ఏదో మా ఇంటాయన చనిపోయి దిగులుతో ఎముకలు మిగిలాయి. నాల్రోజులు తింటే బాగవనా ఏమి. నీకు వీజా ఇవ్వడం ఇష్టం లేకపోతే పోనీలే" కోపంగా వెళ్ళిపోయింది ఈశ్వరమ్మ.

వెనకనుండి మణి నవ్వులు వినబడుతూనే వున్నాయి.

అప్పుల బాధ భరించలేక ఆర్నెల్ల క్రితమే ఈశ్వరమ్మ భర్త పురుగులమందు తాగి చనిపోయాడు. అప్పటినుండీ కొడుకులు కోడళ్ళు ఈశ్వరమ్మను వేధించడం మొదలు పెట్టారు. నాయన అప్పులు చేసి చచ్చిపోయినాడు. అవన్నీ మేము తీర్చాలంటే ఎలా అని ఎదురుతిరిగి తిడుతున్నారు.వాళ్ళ బాధ భరించలేక పోతోంది ఈశ్వరమ్మ. ఇటు భర్త పోయిన దిగులుతో సగం బక్కచిక్కి పోయిందామె.

ఏం చెయ్యాలో అర్థం కాక కొయేటికి పోయి భర్త చేసిన అప్పులు తీర్చాలనే నిర్ణయం తీసుకుంది. అంతే కాదు కోడళ్ళు కొడుకులు పెట్టే బాధల నుండి ఈ విధంగా విముక్తి కూడా కలుగుతుంది అనిపించింది.

కానీ ఆదిలోనే హంసపాదులా మణి వెక్కిరించి వెనక్కి పంపేసాడు. ఈ అవమానంతో పౌరుషంగా అవతలి వీధిలో వుండే ఏజంట్ గోపాల్ దగ్గరికి పోయింది ఈశ్వరమ్మ.

"అల్లుడా గోపాలా నువ్వన్నా నాకొక వీజా చూడరా. కొయేటికి పోయి బతికి పోతాను. ఇక్కడ వుంటే నా కొడుకులు కోడళ్ళు ప్రాణంతోనే గుంత తీసి పూడ్చి పెడతారు" పైట కొంగు నోట్లో కుక్కుకుని ఏడ్చింది ఈశ్వరమ్మ.

మణి మాదిరే ఎగతాళి చేయబోయి ఆమె ఏడుపు చూసి ఆగిపోయాడు గోపాల్.

"ఏడవకు అత్తా. చూద్దాంలే. నువ్వు ముందు తలకు రంగు ఏసుకుని స్టూడియోకు పోయి నవ్వుతా రెండు ఫోటోలు

తీసుకురా. వంటికి కొంచెం కండ పట్టేలా నెల్రోజులు బాగా తిను. ఈ లోపల పాస్పోర్టు చేయించి వీజా తెప్పిస్తా. కానీ ఖర్చు మాత్రం యాభై వేలు అవుతాది. పైసా కూడా తగ్గదు. నువు మొత్తం ఇస్తా అంటేనే నేను పని చేస్తాను" అన్నాడు గోపాల్.

"అప్పో సప్పో చేసి అడిగిన మొత్తం నీకు ఇస్తా గానీ నువు భయపడగాకు అల్లుడూ. ముందు పని మొదలు పెట్టు" అని భరోసా ఇచ్చింది ఈశ్వరమ్మ.

ఏజెంటు గోపాల్ చెప్పినట్లుగా పట్టుదలగా ప్రయత్నించి కాస్త వళ్ళుచేసింది ఈశ్వరమ్మ. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంది. నెలరోజుల్లోనే ఆమెలో చాలా మార్పు వచ్చింది. అందరూ ఆమెను చూసి ఆశ్చర్యపోయారు. అన్నట్లుగానే అప్పుచేసి యాభైవేలు తెచ్చి ఏజంట్ గోపాల్ కు కట్టింది.

"ఈశ్వరమ్మా నక్కను తొక్కావు నువ్వు. మంచి షేకుల ఇంట్లో పని దొరికింది నీకు. జాగ్రత్తగా పని చేసుకొని డబ్బు సంపాదించుకో" అంటూ తొందరగానే కువైట్ విమానం ఎక్కించాడు ఏజంట్.

సంపన్నుల భవనమది. ఎటు చూసినా అలంకరణలతో అందంగా వుంది. పనివాళ్ళే వందమంది పైన వుంటారు. పల్లెటూరు నుండి వచ్చిన ఈశ్వరమ్మకు ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. అక్కడి వాతావరణం ఆ సౌకర్యాలు చూస్తుంటేనే స్వర్గంలో వున్నట్లుగా వుంది. మొదట ఆమెను వంట ఇంట్లో సహాయం చెయ్యమని చెప్పారు. అక్కడ అన్నీ వెండి బంగారాల పాత్రలే. షేకులు బంగారు పళ్ళేలలోనే తింటారట.

ఏ ఒక్కటి కనబడకపోయినా అందరికీ సమస్యే. కాబట్టి జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు పెద్ద వంటవాడు.

ఐదు మంది వంటవాళ్ళు, కూరలు తరిగి ఇవ్వడానికి నలుగురు, వడ్డించే వాళ్ళు మరో నలుగురు అక్కడ వున్నారు. అదంతా వింతగా మరో లోకంలో వున్నట్లుగా అనిపించింది ఈశ్వరమ్మకు. నెలరోజులు బానే గడిచాయి. ఒక నెల జీతం అందుకోగానే సంబరపడిందామె.

ఈ నెలరోజుల్లో ఇంటి దగ్గర సమస్యలు, ఎదుర్కొన్న బాధలు మరిచిపోయి మనిషి నునుపు తేలింది. చాలా అందంగా తయారయింది. కాలం కన్ను కుట్టి ఈశ్వరమ్మ మీద కక్ష కట్టిందేమో.

అక్కడ బంగ్లాదేశ్ నుండి వచ్చిన అలి అనే వంటవాడి కన్ను ఈశ్వరమ్మ మీద పడింది. వంట ఇంట్లో ఆమెను తాకడం, బుగ్గ గిల్లడం, సరసాలు ఆడటం మొదలు పెట్టాడు. వాడి ఆగడాలు భరించలేకపోయింది ఈశ్వరమ్మ.

అక్కడికీ ఎంతో ఓపికగా నయంగా చెప్పి చూసింది.వళ్ళంతా కామాన్ని పులుముకున్న కామాంధుడు వాడు.

మాట వింటే సరే లేకపోతే నీ అంతు చూస్తా అని బెదిరిస్తున్నాడు. ఒకరోజు వంటింటి బయట ఊడుస్తోంది ఈశ్వరమ్మ. వెనకనుండి వచ్చి జంతువులా మీద పడ్డాడు.

భయంతో కేకలు వేసింది ఈశ్వరమ్మ.

నోరు మూసేసాడు. వాడి పట్టు నుండి విడిపించుకోవాలని పెనుగులాడింది. ముసలివాడైనా వంటింట్లో పడి రకరకాల తిండి తిని తెగ బలిసి వున్నాడు వాడు. పట్టు విడవలేదు. ఊపిరి సలపక చేతిలో వున్న చీపురుతో నాలుగు బాదింది. ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి కావడంతో వదిలేసి పరిగెత్తి పారిపోయాడు వాడు.

తనతో పాటూ పని చేసే శ్రీలంక అమ్మాయి సీత అక్కడికి వచ్చింది.

"ఏమయింది, ఏదో శబ్దాలు వినబడ్డాయి" అని ఆదుర్దాగా అడిగింది.

"అబ్బే ఏమీ లేదు. బెంగాలీ చెఫ్ అలీ కూరలు తరగమంటున్నాడు" తడబడుతూ చెప్పింది.

ఆమె కంగారు, బెదురు చూపులు, చెదిరిన జుట్టు, వంట్లో వణుకు చూసి సీత తల పంకించి గ్లాసు నీళ్ళు తెచ్చిచ్చి తాగమంది.

"నువ్వు చెప్పకపోయినా ఏమి జరిగిందో నాకు తెలుసులే" అంది సీత.

తను కూడా తప్పు చేసినట్లు ఆమె అనుకుంటుందేమో అని భయపడింది ఈశ్వరమ్మ.

"భయపడకు. ఇందులో నీ తప్పు ఏమీ లేదులే. వాడి గురించి నాకు బాగా తెలుసు. వాడొక మృగం. ఆడవాళ్ళని వేధించడమే పని వాడికి. ఇలాంటివి షేక్ కు తెలిస్తే ప్రమాదం. తలకాయలు తీసేస్తారు. అందుకే ఎవరూ నోరు విప్పడం లేదు. లోనికి పద మన పని మనం చేసుకుందాం" అంటూ ఈశ్వరమ్మను వంటగదిలోకి తీసుకుపోయింది. అప్పటినుండీ వాడు కక్షతో ఈశ్వరమ్మను వేధించసాగాడు.

అప్పటినుండీ ఒంటరిగా వుండాలంటే భయంగా వుంది ఈశ్వరమ్మకు. సాధ్యమైనంతవరకూ సీతతో కలిసి కాలం గడుపుతోంది.

కొత్తగా వచ్చిన ప్రతి ఆడదాన్ని ఇలాగే వేధిస్తాడని వచ్చినప్పటినుండీ సీతను కూడా ఇలాగే బాధ పెడుతున్నాడని సీత చెప్పడంతో విని ఆశ్చర్యపోయింది ఈశ్వరమ్మ.

"మరి ఈ విషయం షేకుకు చెపితే బావుంటుందేమో కదా" నసిగింది.

"వాడు అదంతా నిజం కాదంటాడు. మనం ఇక్కడ కొత్త వాళ్ళం. షేకు మన మాట నమ్మకపోతే మనకే సమస్య కదా. కాబట్టి మనమే జాగ్రత్తగా వుండాలి" నిట్టూర్చింది సీత.

ఒక వారాంతం సెలవురోజుల్లో సరదాగ గడపడానికి సేటు కుటుంబ సమేతంగా కొందరు పని మనుషులతో అరేబియా సముద్ర తీరాన వున్న గెస్ట్ హౌజ్ కు వెళ్ళిపోయాడు. సీత కూడా వాళ్ళతో పాటూ వెళ్ళింది.

భవనం నిశ్శబ్దంగా వుంది. పనివాళ్ళు రూముల్లో చేరి కబుర్లు చెప్పుకుంటూ రెస్ట్ తీసుకుంటున్నారు.

మధ్యాహ్నం భోంచేసి రూముకు వచ్చేటప్పటికి వంటవాడు అలీ హడావిడిగా అటునుండి బయటికి వస్తున్నాడు. వీడెందుకు ఇక్కడ వున్నాడో అనుకుంది ఈశ్వరమ్మ. తరువాత ఆ సంగతి అప్పుడే మర్చిపోయింది.

అంతే మరుసటి రోజు సేటు రాగానే వంటవాళ్ళు బంగారు గిన్నెలు పోయినట్లు చెప్పడం వెళ్ళి అందరి రూములు వెతకడం ఆ గిన్నెలు ఈశ్వరమ్మ రూములో దొరకడం, సేటు కోపంతో ఈశ్వరమ్మను కొట్టి పోలీసులకు అప్పగించడం జరిగిపోయింది.

ఇపుడేమో ఈ పరాయి దేశంలో దొంగ అని ముద్ర వేయించుకుని జైలు ఊచలు లెక్కపెట్టుతోంది తను. అంతా కలలా జరిగిపోయింది. ఇక ఇక్కడ తన మాటలు నమ్మి రక్షించే నాథుడు ఎవరున్నారు?

"దేవుడా నన్ను కాపాడు, ఈ ఎడారి గుండెల్లో కాస్త తడిని చేర్చు" అంటూ దు:ఖించింది ఈశ్వరమ్మ.

ప్రతి కథకూ ముగింపు వుంటుంది. వుండాలి కూడా. దేవుడు ఈశ్వరమ్మ మొరను విన్నట్లున్నాడు. అనూహ్యంగా సీత జోక్యంతో ఈశ్వరమ్మ కథ మలుపు తిరిగింది.

తప్పు చేసినవాడికి ఏదో ఒకరోజు శిక్ష తప్పదు. ఇంత జరిగాక ఈశ్వరమ్మపై దొంగతనం మోపి జైల్లో పెట్టాక సీత నోరు మూసుకుని వుండలేక పోయింది. ఆమెలో అంతర్మథనం మొదలయింది. ఏదైతే అదయింది ఎలాగైనా ఈశ్వరమ్మను కాపాడాలి అని నిశ్చయించుకుంది. వెంటనే బెంగాలీ వంటవాడి దుర్మార్గాన్ని పూస గుచ్చినట్లు సేటుకు చెప్పేసింది సీత.

కథ అడ్డం తిరిగింది. అలీ పైన అనుమానం వచ్చి ఇంటి బయట వున్న కొన్ని కెమెరాలను పరిశీలించి వంటవాడే ఈశ్వరమ్మ రూములోకి బంగారు గిన్నెలు తీసుకెళ్ళి అక్కడ దాచినట్లు కనుగొన్నారు. సేటు కోపంతో మండి పడ్డాడు. ఇక బెంగాలీ వాడి పని దేవునికే ఎరుక.

అందరూ" ఛీ ఇదేమి పాడు పని" అని తిడుతూ తలా ఒక దెబ్బ వేసి వళ్ళంతా నలగగొట్టి వాడిని పోలీసులకు అప్పగించారు.

సేటు ఈశ్వరమ్మకు క్షమాపణలు చెప్పి సగౌరవంగా ఇంటికి తీసుకొచ్చాడు. తరువాత ఈశ్వరమ్మ జీతాన్ని పెంచి నువ్వు ఎప్పటికీ మాతోనే వుండాలనే మాట తీసుకున్నాడు.

ఈశ్వరమ్మ సీతను కౌగిలించుకుని "దేవతలా నన్ను కాపాడావు నీ ఋణం తీర్చుకోలేను" అంది.

ఆ తరువాత ఈశ్వరమ్మ ఆ ఇంట్లోనే ఇరవైయేళ్ళు పని చేసి ఊళ్ళో భర్త చేసిన అప్పులన్నీ తీర్చేసింది. మిద్దెలు కట్టింది. పొలం కొంది. ఆస్తులు సమకూర్చుకుంది.

ఆమె సంపదను చూసి కొడుకులు కోడళ్ళు కూడా ఆమె డబ్బుకు దాసోహమంటూ ఈశ్వరమ్మ పంచన చేరి ఆమె కాళ్ళు వత్తుతున్నారు.

ఇప్పుడు ఈశ్వరమ్మ ముసల్ది అయింది. మేము మా ఊరు వెళ్ళినప్పుడు ఆమెకు కనపడి పలకరించినప్పుడల్లా అపుడెపుడో కువైట్ లో జరిగిన ఈ విషయాన్ని మా అందరికీ కథగా చెపుతూ వుంటుంది. గల్ఫ్ లోని గత జీవితాన్ని, ఎదుర్కొన్న పరిస్థితులను, ఆ అనుభవాలను మరవడం ఎవరికీ సాధ్యం కాదేమో.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments